క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరవాడ: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇంటర్మీయట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుమారి చెప్పారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని హెచ్ఎం కుమారి కోరారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



పరవాడలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పరవాడ: మండలంలోని పరవాడ, రావాడ గ్రామాల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు శత జయంతిని టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరవాడ సంతబయలులోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్టా సన్యాసప్పారావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రావాడలో మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎలా మెలుగుతున్నారో తెలుసుకున్నారు. కొట్లాటలు, తగాదాల్లో తలదూర్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'రాజ్యాంగానికి కేంద్రం తూట్లు'

కూర్మన్నపాలెం: ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు విమర్శించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 836వ రోజు ఉక్కు దీక్షలో ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నిరంతర వైద్య విద్యతో చక్కటి నైపుణ్యం

మహారాణిపేట : నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా ఆధునిక పద్ధతులు తెలుసుకోవడానికి వీలు కలుగుతుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కేజీహెచ్ ప్రసూతి విభాగం, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో ఆదివారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బుచ్చిరాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రసూతి వైద్యంలో అధునాతన పద్ధతులపై అవగాహన ఉండాలన్నారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చర్చాగోష్టిలో ప్రొఫెసర్లు కేవీఎస్ సంధ్యాదేవి, డాక్టర్ ఆర్.గీతావందన, డాక్టర్ అల్లు పద్మజ, డాక్టర్ కె.శ్యామలాదేవి, డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, డాక్టర్ వాణి తదితరులు పాల్గొని ప్రసంగించారు.



విజ్ఞానం.. వినోదం



అంత్యక్షరి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచుతున్నాయి. గత 15 రోజులుగా జరుగుతున్న శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సబ్బవరం, అడవివరం గ్రంథాలయాల్లో ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు.

- పలు అంశాల్లో చిన్నారులను తీర్చిదిద్దుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న బాలబాలికలు

సింహాచలం/సబ్బవరం: గ్రంథాలయంలో ప్రతి రోజూ ఒక ప్రత్యేక అంశంలో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జనకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచి వారిలో పఠనాశక్తి కలిగిస్తున్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం నేర్పిస్తున్నారు. పలు పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

వినోదాత్మక క్రీడలు

విద్యార్థుల్లో మానసిక, శారీర అభివృద్ధితో పాటు వినోదాన్ని పంచే క్రీడలు ఆడిస్తున్నారు. చెస్, క్యారమ్స్, సూడోకు, మ్యూజికల్ చైర్స్, కప్ గేమ్ వంటి ఇండోర్ క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నారు. చిన్నారులకు ఒక అంశాన్ని ఇచ్చి మాట్లాడించడం, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. చిత్రలేఖనంలో ప్రవేశానికి సంబంధించి ప్రాథమిక అంశాలు నేర్పించారు. గ్లాస్, పేపర్, పాట్ పెయింటింగులో మెలకువలు నేర్పుతున్నారు.

సబ్బవరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం గంథాలయ అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో కథలు చెప్పటం,అంత్యక్షరి,పాటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి శిరీష తెలిపారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు, జ్ఞాన సముపార్జనకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కేంద్రీయ విద్యాలయం విశ్రాంత పర్యవేక్షకుడు బి.సత్యనారాయణ తెలిపారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు పలు రకాల ఆకృతులు తయారుచేసి అబ్బురపరిచారు. విద్యార్థిని వి. శ్రీధ్రుతి తయారు చేసిన పెన్నుల స్టాండ్ గ్రంథాలయానికి అందజేసింది. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.వి.నరసింహం, ఉపాధ్యాయుడు శ్రీహర్ష, గ్రంథాలయ రీడర్స్ ఫోరమ్ కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ ల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత



విరాళం అందజేస్తున్న కన్నూరు సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ శ్రీనివాసరావు



విరాళం అందజేస్తున్న గొన్నా ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి హేమచంద్‌నాయుడు

పరవాడ: నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి కన్నూరు సర్పంచ్ గొల్లవెల్లి కృష్ణవేణి రూ.10 వేల నగదును ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కన్నూరు ఎంపీటీసీ సభ్యుడు గొల్లవెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొన్న ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్ నాయుడు రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, నాయకులు సోమేశ్వరరావు, అప్పలరాజు, అప్పారావు, లక్ష్మి ప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కౌన్సెలింగ్



పాలిటెక్నిక్ విద్యార్థులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి సర్వం సిద్ధంగా ఉన్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగులో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

ఇవి తీసుకురావాలి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ప్రాసెసింగు ఫీజు రసీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో (ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ), 4–10 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), 01.01.2020 నాడు లేదా తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు వారికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.

ర్యాంకులవారీగా కౌన్సెలింగ్ వివరాలు:

కేంద్రం	మే29	మే30	మే31
జూన్1	జూన్2	జూన్3	జూన్4
జూన్5			

కెమికల్ ఇంజినీరింగు కాలేజీ, కంచర పాలెం

1నుంచి 6000 12001 నుంచి 19500 27001 నుంచి 35000 43001 నుంచి 51000 59001 నుంచి 67000 75001 నుంచి 83500 92001 నుంచి 100000 108001 నుంచి 116000

పాలిటెక్నిక్ కాలేజీ, కంచర పాలెం 6001 నుంచి 12000 19501 నుంచి 27000 35001 నుంచి 43000 51001 నుంచి 59000 67001 నుంచి 75000 83501 నుంచి 92000 100001 నుంచి 108000 116001 నుంచి చివరి ర్యాంకు

పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి

1 నుంచి 12000 12001 నుంచి 27000 27001 నుంచి 43000 43001 నుంచి 59000 59001 నుంచి 75000 75001 నుంచి 92000 92001 నుంచి 108000 108001 నుంచి చివరి ర్యాంకు ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు జూన్ 2 నుంచి 5 వరకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలి.

తూర్పు కాపు నూతన జేఏసీ ఏర్పాటు



సంఘీభావం తెలుపుతున్న తూర్పు కాపు జేఏసీ నాయకులు

సీతమ్మధార : తూర్పు కాపు కులాన్ని చిన్నచూపు చూస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హెచ్చరించారు. ఆశీలమెట్టలో జరిగిన రాష్ట్ర తూర్పు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తూర్పు కాపు రిజర్వేషన్ల సాధనకు పలుమార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 36 మందితో తూర్పు కాపు జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర జేసీ చైర్మన్‌గా గిరగా అప్పలస్వామి, కో చైర్మన్‌గా అన్నెపు రామకృష్ణ నాయుడు, గౌరవ చైర్మన్‌గా పైలా శ్రీనివాసరావు, వర్కింగ్ చైర్మన్లుగా బబ్బాది ఫకీర్‌నాయుడు, పతివాడ కృష్ణవేణి, చీఫ్ సెక్రటరీలుగా రాయి శ్రీనుబాబు, ఈ.శ్రీనివాసరావు, కె.అచ్చెంనాయుడు, ఎం.గురునాయుడు, కోశాధికారిగా బెల్లాన సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల అప్పల సూరినాయుడు, ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, యువజన విభాగం రాష్ట్ర సహాధ్యక్షుడు శ్రీనుబాబు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు భైపతి జయలక్ష్మి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ఉక్కునగరం త్రిష్ణా మైదానంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. స్టీల్‌ప్లాంట్ లక్షలాది మొక్కలు నాటి కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్ణా మైదానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్, డాక్టర్ చెన్నా కిషోర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, పర్యావరణ విభాగం ఉద్యోగులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, బాపిరాజు, శ్రీనివాస్, ఎం.పెంటారావు, కొండబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో దళితులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున
- పెందుర్తిలో బీఆర్ అంబేడ్కర్ 132 జయంతి వేడుకలు

సింహాచలం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో దళితులకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక సేవకుడు దుంబూరి రామారావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన అంబేడ్కర్ భావజాలంతో ముడిపడి ఉందన్నారు. చంద్రబాబు ఆలోచన అంబేడ్కర్ ఆలోచన విధానానికి వ్యతిరేకమన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో దళితలపై దాడులు జరిగితే ఏనాడు పట్టించుకోలేదన్నారు. దళితులతో పాటు అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలు



ఉత్సవమూర్తులను తోడ్కొని వస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు.

వైభవంగా నిత్యకల్యాణం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తు లు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్లశ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్’ పోరాటానికి భెల్ సీఐటీయూ మద్దతు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 787వ రోజు జరుగుతున్న రిలే నిరాహారదీక్షలో భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు మద్దతు తెలుపుతూ దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఆదివారం జరిగిన దీక్షా శిబిరంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన పోరాటానికి భెల్ సీఐటీయూ తరఫున, ఇతర ప్రభుత్వరంగ సంస్థల తరఫున పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భెల్ సీటు నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.పవన్ కుమార్, బి.కృష్ణమూర్తి, ఎస్.ప్రసాద్, రాజు, సత్యనారాయణ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల కార్మిక వర్గాల నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

బీచ్ రోడ్డు: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలంటూ రవాణా శాఖ సిబ్బంది ఆదివారం బీచ్ రోడ్డులో ప్లకార్డులు ప్రదర్శించారు. మిషనల్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆర్కేబీచ్ వద్ద రవాణా శాఖ సిబ్బంది పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. సిగ్నల్ పాయింట్ల వద్ద వాహనాల ఇంజిన్‌ను ఆపడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతో పాటు ఇంధనం కూడా ఆదా చేసుకోవచ్చనని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో వేణుగోపాలరావు, మోటారు వాహనాల తనిఖీ అధికారులు పాల్గొన్నారు.